# హత్యచేసి ఎదురుకాల్పులంటే సరిపోతుందా?

## ఎన్‌కౌంటర్లపై హైకోర్టు తీర్పును నిరసించండి



'ఎన్‌కౌంటర్లన్నీ పోలీసు హత్యలే' అన్న నినాదం వినని వారు రాష్ట్రంలో ఉండరు. దాదాపు నలభై సంవత్సరాలుగా ఈ వ్యాఖ్య ఒక నినాదం రూపంలో హక్కుల ఉద్యమం, ప్రజాతంత్ర ఉద్యమాలు ప్రచారంలో పెట్టాయి.

ఇది కేవలం ఒక రాజకీయ నినాదం కాదనీ, ఇది చట్ట సంబంధమైన వ్యాఖ్య అనీ కూడా ఈ ఉద్యమాలు స్పష్టం చేశాయి. అంటే చట్టమే 'ఎన్‌కౌంటర్' అనే దానిని హత్యగా గుర్తిస్తుందని అర్థం. ఇందులో పెద్ద రహస్యమేమీ లేదు. నిగూఢమైన న్యాయ సిద్ధాంతమూ లేదు. ఆయుధాలు ధరించిన ఒక వ్యక్తిని తాము అరెస్టు చేయబోగా అతను లొంగిపోకుండా తమపైన దాడి చేశాడనీ, దానివల్ల తమకు ప్రాణాపాయం ఏర్పడిందనీ, ఆత్మరక్షణలో తాము ఎదురుకాల్పులు జరపగా అతను చని పోయాడని ప్రతీ 'ఎన్‌కౌంటర్'లోనూ పోలీసులు అంటుంటారు. ఆత్మరక్షణలో చేసిన హత్యకూడా చట్టం కళ్ళలో హత్యే. అది నిజంగా ఆత్మరక్షణలో జరిగినట్టయితే దానికి శిక్ష ఉండదుగానీ అది హత్య కాకుండా పోదు. అది ఆత్మరక్షణలో జరిగిందా లేదా అనేది తేలవలసింది నేర విచారణలోనే తప్ప చంపిన వాడే ప్రకటించుకొని స్వేచ్ఛగా వెళ్ళిపోవడానికి వీలులేదు. అతని పైన హత్య కేసు నమోదు కావాలి, నేర విచారణ జరగాలి, ఆత్మరక్షణలో ప్రాణం తీసే అగత్యం తనకు ఏర్పడిందని అతను రుజువు చేసుకోవాలి. ఈ విషయంలో పోలీసులకూ, మామూలు పౌరులకూ తేడా ఏమీలేదు. చంపినవాడు 'ఆత్మరక్షణలో చేశాను' అని ప్రకటించి నంతమాత్రాన స్వేచ్ఛ పొందేటట్టయితే జీవించే హక్కుకు అర్థమేమైనా ఉంటుందా?

ఇది ఎవరికైనా సులభంగా అర్థం అయ్యే విషయమేనని మేము భావిస్తున్నాం. అయితే న్యాయస్థానాలకు అర్థం చేయించడానికి చాలా కష్టతర మైన ప్రయత్నం చేయవలసి వచ్చింది. అది ఒక దశాబ్దం కింద సఫలమైనట్టే అయి చివరికి విఫలమయింది. ఎన్‌కౌంటర్ అనేది దానంతటదే హత్యకాదనీ, 'ఫలానా పోలీస్ అధికారి ఫలానా వ్యక్తిని ఉద్దేశ్య పూర్వకంగా చంపి దానికి ఎదురుకాల్పుల కథ అల్లాడు' అని ఎవరైనా నిర్దిష్టంగా ఫిర్యాదుచేస్తేనే ఆ పోలీసు అధికారిపైన హత్యకేసు నమోదు చేయవలసి ఉంటుందనీ మన రాష్ట్ర హైకోర్టు ఇప్పుడు తీర్పు చెప్పింది. పోలీసులు ముఖానికి ముసుగువేసుకొని ఎవరినైనా చంపేసినా, చీకటిలో మాటువేసి చంపేసినా, లేదా ఫిర్యాదు చేసే నాధుడు లేని ఏ పాకిస్తానీనో, బంగ్లాదేశీనో హైదరాబాద్‌లో కాల్చేసినా, నిర్దిష్టమైన ఫిర్యాదు ఉండజాలదు. కాబట్టి అది హత్యకాదు. మరి అటువంటి కేసులలో ఏం జరగా లంటే మేజిస్టీరియల్ విచారణలో ఏమైనా అనుమానాస్పదంగా తేలితే అప్పుడు తదనుగుణంగా చర్యలు చేపట్టాలంటుంది హైకోర్టు.

ఇది చట్టవిరుద్ధము, రాజ్యాంగ విరుద్ధమైన తీర్పేకాక 'జీవించే హక్కు'కు చాలా నష్టకరమైనది కూడా. ఈ తీర్పును తిరస్కరించి జీవించే హక్కును కాపాడుకుందాం రమ్మని మేము ప్రజలకు పిలుపునిస్తున్నాం. ఒకరిని చంపేసి, ఫిర్యాదుచేయగల వాళ్ళను బెదిరించి ఫిర్యాదు లేకుండా, మేజిస్టీరియల్ విచా రణకు ఎవరూ హాజరుకాకుండా, చేసుకునేటట్టయితే ఏ కేసూ ఉండదని పోలీసులు హామీ పొందడం సాధారణ పౌరుల మనుగడకు అత్యంత ప్రమాద కరం. మొన్నటికి మొన్న విశాఖపట్నంలో జరిగిన ఘటన అందరికీ గుర్తుండే ఉంటుంది. నిజాయితీపరుడైన ఒక బ్యాంక్ అధికారిని ఎవరో దుర్మార్గులు చాలా కిరాతకంగా హత్యచేశారు. పోలీసులు ఇద్దరు అనుమానితు లను పట్టుకొని కాల్చిచంపి 'తమ మీద తిరగబడితే ఆత్మరక్షణలో కాల్చి చంపాం' అని ప్రకటించారు. భయంవల్లనో, ఏ కారణంగానో మృతుల కుటుం బాలు ఫిర్యాదు చేయలేదు. మేజిస్టీరియల్ విచా రణలో ఏం చెప్పారో, అసలేమైనా చెప్పారో లేదో తెలీదు. ఇక అంతేనా? ఆ బ్యాంకు అధికారిని చంపిన వారికి తప్పక శిక్షపడవలసిందే. కానీ శిక్ష వేయవలసింది న్యాయస్థానమా పోలీసులా? ఈ ఇద్దరే హంతకులని వాదన కోసం అనుకుందాం. పోలీసులివాళ ఆ దుర్మార్గులను చంపారు. రేపు సన్మార్గు లను చంపుతారు. అప్పుడు కూడా తమకు అలవాటైన పద్ధతిలో 'నిర్దిష్టమైన ఫిర్యాదు' లేకుండా చేసుకుంటారు. మెజిస్ట్రీరియల్ విచారణకు సాక్షులు రాకుండా చేసుకుంటారు. అప్పుడేం గతి?

'ఆత్మరక్షణ'లో ఎదుటివారిపైన ఎదురుదాడి చేసేహక్కు పోలీసులకే కాదు పౌరులందరికీ ఉంది. ఎంతటి ప్రమాదం ఏర్పడితే అంత మేరకు మాత్రమే ఎదురుదాడి చేసే హక్కు ఉందని చట్టం అంటుంది. అంతకు మించి చేస్తే అది నేరం అవుతుంది. అందుకే ఆత్మరక్షణలో హింసకు పాల్పడ్డాను అని చెప్పుకున్న వ్యక్తి స్వేచ్ఛగా వెళ్ళిపోవడానికి వీలులేదు. అతనికి ఎంత ప్రమాదం ఏర్పడింది, దానిని ఎదుర్కొనడానికి ఎంతటి ఎదురుదాడి చేశాడు అనేది నేర విచారణలో తేలవలసిందే. పైగా అవసరమైన మేరకే చేశానని అతనే రుజువు చేసుకోవాలి అని చట్టం అంటుంది. అంటే అతని పైన కేసు నమోదు కావాలి, నేర విచారణ జరగాలి, ఏ సంగతీ విచారణలో తేలాలి.

సాధారణ పౌరుల విషయంలో ఇది న్యాయస్థానాలు అంగీకరించే సూత్రమే. ప్రతిరోజూ అమలుచేసే సూత్రమే. పోలీసులకు ఈ విషయంలో భిన్నమైన సూత్రం వర్తిస్తుందని చట్టంలో ఎక్కడా లేదు. అయినప్పటికీ భిన్నమైన సూత్రం వర్తించాలని హైకోర్టు భావించింది. శాంతిభద్రతల నిర్వహణలోనూ, నేరాల అదుపులోనూ పోలీసులకు ఉండే విధులన్నిటినీ ఏకరవు పెట్టి 'ఇంత బృహత్తరమైన పాత్రను పోలీసు యంత్రాంగానికి అప్పగించినప్పుడు, విధి నిర్వహణ క్రమంలో వారు పాల్పడే తప్పిదాలను సాధారణ పౌరులు చేసే నేరా లతో సమానంగా చూడాలన్న వాదనను అంగీకరించడం కష్టం' అంటుంది హైకోర్టు. అటువంటి నిర్ణయానికి వచ్చే అధికారం శాసనకర్తలకు ఉందేమోగానీ న్యాయస్థానాలకు ఉందా? పోలీసులు విధినిర్వహణ పేరిట చేసే నేరాలకు వేరే నేరస్మృతి వర్తించాలని శాసనకర్తలు భావించలేదు. నేరస్మృతిలో ఎక్కడా ఆ తేడా లేదు. చట్టాలలో లేనిదానిని ఊహించే అధికారం కోర్టులకెక్కడిది?

'హింస చేసే వారికి హక్కు లెక్కడివి?' అన్న ప్రశ్న తరచుగా వింటుంటాం. అది వినడానికి న్యాయంగానే తోస్తుందిగానీ మంచివాళ్ళకు

మాత్రమే హక్కులుండే సమాజం నాగరికం అని పించుకుంటుందా? మంచి కారణంగానో, చెడ్డ కారణంగానో సమాజం కట్టడిని అతిక్రమించే వాళ్ళను కూడా అందరితో సమానంగా పౌరులుగా గుర్తించి, సమానంగా హక్కులు కల్పించి, వారిని అదుపు చేసినా కూడా ఆ హక్కుల పరిధిలో మాత్రమే చేసే సమాజమే నాగరికం అనిపించు కుంటుంది. మన రాజ్యాంగకర్తలు ఆ విధంగా భావించారు కాబట్టే హక్కులు అందరికీ ఒకే రకంగా కల్పించారు. వాళ్ళేమీ ప్రశాంత వాతావరణంలో కూర్చొని రాజ్యాంగాన్ని రాయలేదు. విపరీతమైన హింసాకాండ మధ్య భారత రాజ్యాంగం రాయబడింది. దేశ విభజన సందర్భంగా హిందువులు, ముస్లింలు, సిక్కులు మతం ప్రాతిపదికన పెద్దెత్తున నరుక్కున్నారు, చంపుకున్నారు. ఊళ్ళకు ఊళ్ళు ఖాళీ అయ్యాయి, కనీసం 10 లక్షల మంది చనిపోయారు. ప్రపంచం అప్పటికెక్కడా చూసి ఎరుగని బలాత్కారపు జనాభా మార్పిడీ జరిగింది. ఇదంతా జరుగుతుండగా రాసినదైనా సరే రాజ్యాంగం అందరికీ ఒకే రకంగా హక్కులు కల్పించింది, అనుల్లంఘ నీయమైన హక్కులు కల్పించింది. ఆ స్ఫూర్తిని న్యాయస్థానాలు మరచిపోవడం విచారకరం.

**ఒకరిని చంపేసి, ఫిర్యాదుచేయగల వాళ్ళను బెదిరించి ఫిర్యాదు లేకుండా, మేజిస్ట్రేరియల్ విచారణకు ఎవరూ హాజరుకాకుండా, చేసుకునేటట్టయితే ఏ కేసూ ఉండదని పోలీసులు హామీ పొందడం సాధారణ పౌరుల మనుగడకు అత్యంత ప్రమాదకరం.**

'చట్టాన్ని అందరూ గౌరవించి నడుచుకునే స్థితి ఉంటే చాలా బాగుండేది. అయితే కొంతమంది తాము ఇతరులకు హానిచేస్తాము గానీ తమకు ఎట్టి పరిస్థితిలోనైనా చట్టబద్ధ పాలనే వర్తించాలన్నప్పుడు సమస్య వస్తుంది. నిజమే, న్యాయంగా వర్తించిన వాడికే న్యాయంకోరే హక్కు ఉంది అన్న సూత్రం నేరస్మృతిలో లేదు. చట్టాన్ని గౌరవించని వారికి రాజ్యాంగ రక్షణ ఉండదన్న సూత్రమూ లేదు. అయితే ఈ మేరకు మాత్రం చెప్పగలం. ఒక వ్యక్తిగానీ, బృందంగానీ అమాయకులను చంపుతూ, చంపుతామని ప్రచారం చేసుకుంటూ తమ చర్యలను అదుపుచేసే విషయంలో అన్ని రకాల రక్షణ తమకు కావాలని కోరడానికి వీలులేదు' అని హైకోర్టు అభిప్రాయపడింది. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమైన అభిప్రాయం. రాజ్యాంగం సంగతి అటుంచి, ఎటువంటి వారితో నైనా నాగరికంగా వ్యవహరించే సమాజమే నాగరికమైనది. తన నియమాలను గౌరవించే వాళ్ళతో మాత్రమే నాగరికంగా వ్యవహరించేది నాగరిక సమాజం కాదు.

అయినా పోలీసులు 'అమాయకులను' చంపడాన్ని కార్యక్రమంగా పెట్టుకున్న వాళ్ళను మాత్రమే ఎన్‌కౌంటర్ల పేరిట చంపడం లేదు. కోర్టులు విచారించి శిక్షించగల ముద్దాయిలను సైతం తామే న్యాయనిర్ణేతలై చంపు తున్నారు. 'నక్సలైట్' అన్న ముద్ర ఉన్న వారెవ్వరినైనా అరెస్టు చేసే అవకాశం ఉండీ ఆ ప్రయత్నం చేయకుండా నేరుగా కాల్చి చంపుతున్నారు. ముదిగొండలో లాగా తాము విరమించమన్నప్పుడు ఆందోళన విరమించలేదన్న కక్షతో కాల్చి చంపుతున్నారు. నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయనుకున్నప్పుడూ, 'దొంగ వెధవలకు భయం లేకుండా పోయిం'దనుకున్నప్పుడూ కూడా ఒకరిద్దరిని కాల్చి చంపి భయం కల్పిస్తున్నారు.

హైకోర్టు న్యాయమూర్తులు చట్టాన్ని తప్పుగా అర్థం చేసుకోవడం కూడా ఈ తప్పుడు తీర్పుకు దారితీసింది. పార్లమెంటుపైన 2001 డిసెంబర్ 13 నాడు జరిగిన దాడిని, ఆ దాడికి పాల్పడిన అయిదుగురిని సిఆర్‌పిఎఫ్ జవాన్లు కాల్చిచంపిన విషయాన్ని ప్రస్తావిస్తూ వారిపైన కూడా హత్య కేసు నమోదు చేయాలా? అని ప్రశ్నిం చారు. నమోదు చేసినట్టయితే, దాడి చేసిన వారు చంపదలచుకుంది పార్లమెంటు సభ్యులనే తప్ప ఈ జవాన్లను కాదు కాబట్టి వారిచర్య ఆత్మరక్షణ కిందికి రాదనీ వారికి శిక్షపడి ఉండేదనీ అభిప్రాయపడ్డారు.

కానీ చట్టంలో ఉండే ఆత్మరక్షణ హక్కు మన ప్రాణాన్ని కాపాడుకునే హక్కే కాదు, పక్కవారి ప్రాణాన్ని కాపాడే హక్కు కూడా. అంతేకాక, పోలీసు సిబ్బందికి నేరాలను నిరోధించడానికి అవసరమైన బలప్రయోగానికి పాల్పడే అధికారమూ చట్టంలో ఉంది. ఎటొచ్చీ ఆత్మరక్షణలోనైనా, విధి నిర్వహణలోనైనా అవసరమైన మేరకే బలప్రయోగానికి పాల్పడ్డారా లేదా అన్నది తేలాలి. దానికోసం కేసు నమోదు చేయాలి, నేరపరిశోధన జరపాలి. జవాన్ల కాల్పులలో చనిపోయిన అయిదు గురిలో నలుగురు మాత్రమే పార్లమెంటు పైన దాడిచేసిన దుండగులై ఉంటే? అయిదవ వ్యక్తి స్థానికంగా పరిచయాలేవీ లేని పర్యాటకుడు అయివుంటే? అతన్ని కూడా దుండగుడిగా భావించి అన్యాయంగా కాల్చేశారని ఫిర్యాదు చేసేవాళ్ళెవరూ లేకపోతే ఆ చావు ఈ చావులతో కలిసి పోవలసిందేనా? అందుకే హత్యకేసు నమోదు, స్వతంత్రమైన నేరపరిశోధన, అవసరం. అంత మాత్రం చేత ఆ సిఆర్‌పిఎఫ్ జవాన్లను అరెస్టు చేయనక్కర లేదు, ఉద్యోగాల నుండి బర్తరఫ్ చేయనక్కరలేదు. కేసు నమోదైన వెంటనే అరెస్టు చేసి తీరాలని, ఉద్యోగం నుంచి తీసివేయాలని నియమం లేదు. నేరపరిశోధన మాత్రం స్వతంత్రంగా, నిష్పాక్షికంగా జరగాలి. చివరికి ఆత్మరక్షణ (ఇందులో చట్టం ప్రకారం పక్కవారి ప్రాణరక్షణ కూడా మిళితమై ఉందని మరొకసారి చెప్పాలి)లో గానీ విధి నిర్వహణలో గానీ కాల్పులు సహేతుకంగా జరిపారన్న నిర్ధారణకు వస్తే, విచారణ ఆదిలోనే వారిని నిర్దోషులుగా ప్రకటించవచ్చు. ఈ రకమైన ప్రక్రియను అనుసరించడం నాగరికం అనిపించుకుంటుంది గానీ అయిదు ప్రాణాలు పోయిన ఆ ఘటనను ఏ విచారణా లేకుండా మూసేయడం సరైనది కాదు.

మెజిస్ట్రేరియల్ విచారణ పట్ల హైకోర్టు ప్రదర్శించిన విశ్వాసాన్నీ, దానికి ఆపాదించిన ప్రాముఖ్యాన్నీ ప్రస్తావించి ముగిస్తాము. ఆ విచారణ చేపట్టేది ఆర్‌డివో స్థాయి అధికారులు. వారికి న్యాయస్థానాలకుండే ఏ అధికారమూ లేదు. ఏ సాక్షినీ విచారణకు రప్పించలేరు. రాకపోతే ఎవరినీ దండించలేరు. ఆ విచారణలో సాక్షుల క్రాస్ - ఎగ్జామినేషన్ ఉండదు. విచారణాధికారి అభిప్రాయం తీర్పు కాదు. అన్నిటినీ మించి, కోర్టులంటేనే అంతంతమాత్రం గౌరవం ఉన్న పోలీసులకు ఈ విచారణలంటే అసలు గౌరవం లేదు. ఆర్‌డివో కార్యాలయాన్ని, మృతుని గ్రామాన్నీ చుట్టుముట్టి ఎవ్వరూ విచారణకు రాకుండా చేయగలరు, తరచూ చేస్తారు కూడా. అటువంటి విచారణలో నిజం తేలితేనే కేసు పెట్టాలనడం కేసు పెట్టనే అక్కర లేదనడంతో సమానం.

ఏ రకంగా చూసినా అన్యాయమైన ఈ తీర్పు ప్రజల జీవించే హక్కుకు తీవ్ర విఘాతం. దీనిని నిరసిస్తూ మానవ హక్కుల వేదిక రాష్ట్ర వ్యాపితంగా చేపడుతున్న కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ –

మానవ హక్కుల వేదిక
**Human Rights Form (HRF)**

1 డిసెంబర్ 2007

---

**ఈ తీర్పు ఇచ్చింది ముగ్గురు జడ్జీల బెంచి. అందులో ఇద్దరు మెజారిటీ అభిప్రాయంగా దీనిని ప్రకటించారు. ఆ న్యాయమూర్తులు ఎల్.నరసింహారెడ్డి, జి.యతిరాజులు గార్లు. మూడవ జడ్జి అయిన బిలాల్ నాజ్కీగారు ఈ తీర్పుతో విభేదించి, హక్కుల సంఘాల వాదనే సరైనదన్నారు. అయితే మెజారిటీ తీర్పే కోర్టు తీర్పుగా భావించబడుతుంది.**